క్లుప్తంగా

ఇక నుంచి ఆర్డీఓ కార్యాలయంలో స్పందన



చైత్రవర్షిణి, ఆర్డీఓ

సీటీఆర్ఐ: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని మే ఒకటో తేదీ సోమవారం నుంచి రాజమహేంద్రవరంలోని రెవెన్యూ డివిజన్ అధికారి (సబ్ కలెక్టర్) కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం, బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

ఒకటి నుంచి టేబుల్ టెన్నిస్ శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: వీరేశలింగం పుర మందిరం (రాజమహేంద్రవరం టౌన్ హాల్) ఎదురుగా ఉన్న రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో మే ఒకటి నుంచి 30వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అకాడమీ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో టేబుల్ టెన్నిస్‌తో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, రోబో మిషన్‌పై తర్ఫీదు ఇస్తామనినారు. ఉదయం 6 నుంచి 8 వరకు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా జరుగుతుందన్నారు. ఆసక్తి కలవారు 98663 77035, 93475 86233 నంబర్లను సంప్రదించాలన్నారు.

30 నుంచి యోగా శిక్షణ శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రణవ సంకల్ప యోగా సమితి నిర్వాహకులు పతంజలి శ్రీనివాస్ నిర్వహణలో ఈనెల 30వ తేదీ నుంచి మే 14వ తేదీ వరకు వేసవి యోగాశిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగర పాలకసంస్థ కార్యాలయంలో యోగాశిబిరం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఉదయం 5 నుంచి ఏడు గంటల వరకూ బైపాస్ రోడ్డులోని దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో తరగతులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ పాండురంగారావు, యోగ శిక్షకులు సబ్బిశెట్టి సుందరి, డీఆర్‌డీఏ పీడీ ఎస్ సుభాషిణి పాల్గొన్నారు.

సీఈఎం వ్యవస్థాపకుడు జయశంకర్ మృతి



ధవళేశ్వరం: ధవళేశ్వరం సీఈఎం సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఎం హాస్పిటల్, జయ స్కూల్ కరస్పాండెంట్ బోయినేని జయశంకర్ గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆయన 30 సంవత్సరాలుగా ధవళేశ్వరంలో విద్య, వైద్య రంగంలో సేవలందిస్తున్నారు. ధవళేశ్వరంలో హాస్పిటల్, స్కూల్, చిల్డ్రన్ హోమ్, వృద్ధుల ఆశ్రమాన్ని నిర్మించారు. జయశంకర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి సంస్థ ఉద్యోగులు, పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

రెండు బైకుల చోరీ

బిక్కవోలు: మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు బైకుల చోరీపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలు గ్రామానికి చెందిన జంపా సుబ్రహ్మణ్యం పొలం గట్టు వద్ద బైకు ఉంచి చేలోకి వెళ్లి తిరిగొచ్చి చూసేసరికి కనిపించలేదు. ఊలపల్లికి చెందిన తంగెళ్ల సునీల్‌జార్జి ఇంటి బయట ఉంచిన బైకు మాయమైంది. బాధితుల ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డ్రిప్ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: రాయితీపై డ్రిప్ పరికరాలు అందించడానికి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సూక్ష్మసేద్య అధికారి ఎస్.రామ్‌మోహన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు సమీపంలోని రైతుభరోసా కేంద్రాలను సంప్రదించి, వీహెచ్ఏ/ వీఏఏల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆయా మండలాల ఉద్యాన అధికారులు, మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించాలన్నారు. ఉద్యానాధికారుల ఫోన్ నంబరు మండలాల వారీగా.. నల్లజర్ల 79950 86870, దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం 79950 86871, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, ఉండ్రాజవరం, పెరవలి 79950 86861, అనపర్తి, రంగంపేట, బిక్కవోలు, రాజానగరం 79950 86841, కోరుకొండ, గోకవరం, సీతానగరం 79950 86840, కడియం, రాజమహేంద్రవరం రూరల్ 79950 86839.

ప్రభుత్వ కళాశాలల విజయకేతనం

రాజమహేంద్రవరం రూరల్/కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విజయ బావుటా ఎగురవేశారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఫలితాలు సాధించారు. పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వీరు చదువులో సత్తా చాటారు. విద్యాభివృద్ధికి జగన్ ప్రభుత్వం చేస్తున్న కృషి, కల్పిస్తున్న వసతులు, అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విజయం సాధించారు.

ఎంబీబీఎస్ చదువుతా



తల్లిదండ్రులు లేకపోవడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగిలో అమ్మమ్మ సుంకర లక్ష్మి పోషిస్తూ చదివిస్తోంది. అధ్యాపకుల సూచనలు, సలహాలతో శ్రద్ధగా చదవడం ద్వారా బైపీసీలో 974 మార్కులు సాధించా. ఎంబీబీఎస్‌లో సీటు సాధించి చదివి, వైద్యురాలిగా పేదలకు సేవలందించాలన్నదే నా లక్ష్యం.

– కె.దివ్య, అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాల, ధవళేశ్వరం

ఐపీఎస్‌గా సేవ చేస్తా



తండ్రి లేరు. తల్లి గంగాభవాని థెరపిస్ట్‌గా పనిచేస్తూ చదివిస్తోంది. అధ్యాపకుల సలహాలతో రోజూ క్రమం తప్పకుండా చదవడంతో ఎంపీసీలో 964 మార్కులు సాధించా. బీటెక్ పూర్తి చేసి ఐపీఎస్ కావాలన్నది నా లక్ష్యం. ఐపీఎస్ అయ్యి పేద ప్రజలకు సేవలందిస్తాను.

– వై.మహాలక్ష్మి, అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాల, ధవళేశ్వరం

ఐఏఎస్ అవుతా



తండ్రి రాజు వ్యవసాయ కూలి. నాకు ఎంపీసీలో 963 మార్కులు వచ్చాయి. అధ్యాపకుల బోధన, పట్టుదలగా చదవడంతో మంచి మార్కులు సాధించా. డిగ్రీ చదివి ఐఏఎస్ సాధించాలన్నదే నా ధ్యేయం. ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపుతాను.

– ఎస్.కీర్తన, అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాల, ధవళేశ్వరం

సీఏ కావడమే లక్ష్యం



నా తండ్రి మాగాపు రమేష్ కారు మెకానిక్. నా తల్లి లీలాపుష్ప నా చదువుకు ఎంతగానో ప్రోత్సాహమిస్తోంది. సీఏ చదవడమే నా ప్రధాన లక్ష్యం. సీఈసీలో 968 మార్కులు వచ్చాయి. నా విజయానికి తల్లిదండ్రులతో పాటు నా కళాశాల అధ్యాపకులు ఎంతో కృషి చేశారు.

– ఎం.అనూష, ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజమహేంద్రవరం

సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వీరవరంలో గడప గడపకూ..



వీరవరంలో స్కూలు విద్యార్థులతో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

కడియం: స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను గుర్తించి, వాటిని పరిష్కరించడం ద్వారా సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ప్రభుత్వ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వీరవరం గ్రామంలో రెండో రోజు శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనితీరు, సంక్షేమ పథకాలు అందుతున్న విధానంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలతో మరింతగా మమేకమై వారి సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ముందుగా వీరవరం సచివాలయం– 1 పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. అర్హత ఉండీ పథకాలు అందకపోతే, అందుకు గల కారణాలను తెలుసుకుని, వాటిని తక్షణం పరిష్కరించి ఆయా పథకాలు వారికి అందేలా చూడాలని వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. అలాగే గ్రామంలోని స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, స్థానిక నాయకులు బత్తుల రాము, రేమళ్ల ప్రసాద్, రేమళ్ల హరీష్, బత్తుల రాజబాబు, కొత్తపల్లి రాము, దొంతంశెట్టి చిన వీర్రాజు, లంక కనకయ్య, ఎం.రాంబాబు, పెనుగొండ పోసయ్య, బచ్చు కృష్ణారావు, గుర్రపు సుబ్బారావు, వీర్లపాటి వీరేంద్రరాజు, షణ్ముఖ, సూర్యారావు, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ నాయకులు అయినవిల్లి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఊటుకూరి శైలజ, శాక పట్టాభి పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు ఇంటర్న్‌షిప్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ నరసింహులు

సీటీఆర్ఐ: రాష్ట్ర ప్రభుత్వం యువతకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చదువుతో పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి రూపకల్పన చేసిందని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు అన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి ఆరునెలల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వికాస కేంద్రం కూడా ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆయా కాలేజీలకు అందజేస్తూ, అనుసంధాన కర్తగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో వికాస పీడీ లచ్చారావు, జీఎం ఇండస్ట్రీస్ కె.వెంకటేశ్వర రావు, రాజమహేంద్రవరం వికాస మేనేజర్ సత్యనారాయణ, నన్నయ యూనివర్సిటీ ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పశువైద్యుల సేవలు అత్యంత కీలకం



పశుపోషణలో ప్రతిభ కనబరిచిన రైతులను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సమాజంలో పశువైద్యుల సేవలు అత్యంత కీలకమని కలెక్టర్ మాధవీలత అన్నారు. కలెక్టరు చాంబర్‌లో శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఉన్న పశువైద్యులు, పశువైద్య పట్టభద్రులందరూ కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన రైతులందరూ పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి ద్వారా జీవనం సాగిస్తున్నారని, వారికి నిత్యం అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్న పశువైద్యులను అభినందించారు. అనంతరం పశుపోషణలో ప్రతిభ కనబరిచిన రైతులను జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ సన్మానించారు. అలాగే పశువైద్య పట్టభద్రుల సేవాసంఘం, పశుసంవర్ధక అధికారుల సేవాసంఘం ఆధ్వర్యంలో పశువైద్యులను సత్కరించారు.

లింగ నిర్ధారణ చేసే ల్యాబ్‌లపై నివేదికలివ్వండి

- కలెక్టర్ మాధవీలత
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: లింగనిర్ధారణ చేసే ల్యాబ్‌లు, అబార్షన్లు అయ్యే కేసులకు సంబంధించి ఆయా ఆసుపత్రుల వారీగా పూర్తిస్థాయి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్, మలేరియా అంశాలపై సమన్వయ శాఖల, సభ్యుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో జరిగే జననాల నిష్పత్తిపై సమగ్రంగా నివేదిక అందజేయాలన్నారు. ఆసుపత్రులు, ల్యాబ్‌లపై పర్యవేక్షణ లోపం ఉందన్న ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రతి ల్యాబ్‌పై నిర్ణీత సమయంలో ఆకస్మిక తనిఖీలను సంబంధిత కమిటీ సభ్యులు అందరూ కలిసి చేయాల్సి ఉంటుందన్నారు. కొన్ని పేరున్న ఆసుపత్రుల్లో అబార్షన్ కేసులు నమోదు చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రతి రెండు, మూడు నెలలకు జరిగే జిల్లా స్థాయి సమావేశానికి హాజరయ్యే కమిటీ సభ్యులు ప్రతి నెలా తప్పకుండా సమావేశాలు చేపట్టాలన్నారు. దీనిపై వైద్యాధికారులు వివరాలు తెలుపుతూ 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జిల్లాలో 23,792 జననాలు సంభవించగా, వాటిలో బాలురు 12,279 మంది, బాలికలు 11,514 మంది ఉన్నారన్నారు. ఎక్కువ బాలుర జననాలు జరిగిన మండలాలపై దృష్టి పెట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 774 అబార్షన్ కేసులు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. వీటిపై ఆయా మండలాల్లో నిఘా పెంచి డెకాయ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 138 స్కానింగ్ సెంటర్లు (ల్యాబ్‌లు) ఉన్నాయని, రాజమహేంద్రవరం డివిజన్ లో 119, కొవ్వూరు డివిజన్‌లో 19 ఉన్నట్టు వివరించారు.

మలేరియా నిర్మూలనపై సమీక్ష

జిల్లాలో మలేరియా నిర్మూలనకు అధికారులు సమర్థంగా కృషి చేయాలని, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. మలేరియా నిర్మూలనపై సమన్వయ వైద్యాధికారులతో ఆమె సమీక్షించారు. మలేరియా, డెంగీ తదితర కేసులు నమోదు కాకుండా పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికతో అన్ని గ్రామ పంచాయతీలు, నగరపాలక, పురపాలక సంఘాల పరిధిలో మెరుగైన శానిటేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో డీటీసీఏ డాక్టర్ ఎస్.వసుంధర, డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్ కుమారి, డీఎన్ఎం డాక్టర్ పి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మాతృమరణాలు దురదృష్టకరం

జిల్లాలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండు మాతృ మరణాలు సంభవించడం దురదృష్టకరమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత విచారం వ్యక్తం చేశారు. గత మూడు నెలల్లో జరిగిన మాత, శిశు మరణాలపై వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ సిబ్బందితో శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరైన పర్యవేక్షణ ఉంటే వీటిని నివారించగలగేవారమన్నారు. గర్భిణిగా నమోదైన దగ్గర నుంచి ఎంసీపీ కార్డులో సమగ్రమైన విధానంలో పరీక్షల వివరాలు పొందుపరిస్తే తద్వారా తదుపరి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఉంటుందన్నారు. రక్తపరీక్షలు, రక్తపోటు, మధుమేహం, రక్తంలో హిమోగ్లోబిన్ వంటి పరీక్షల ఫలితాలు కార్డులో నమోదు చేయాలన్నారు. భవిష్యత్తులో ఒక్క మాతృ మరణం లేకుండా ప్రణాళికతో పటిష్టమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

సుందరీకరణకు రుడా కృషి



కుండీలను పరిశీలిస్తున్న షర్మిలారెడ్డి, బాలస్వామి

రాజమహేంద్రవరం సిటీ: సుందరీకరణ పనులకు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ప్రాధాన్యం ఇస్తోందని చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి అన్నారు. రుడా పరిధిలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఏర్పాటు చేసేందుకు రుడా నిధులతో ప్రత్యేకంగా తయారు చేయించిన 500 కుండీలను శుక్రవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాలస్వామి, ఏవో శ్రవణ్ కుమార్, సెక్రటరీ శైలజావల్లి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: నిబంధనలు అతిక్రమించి భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ హెచ్చరించారు. నగరంతో పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను గుర్తించిన కమిషనర్ తక్షణమే తొలగింపు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఆ కట్టడాల తొలగింపు చర్యలు చేపట్టారు. 22వ డివిజన్ వంకాయలవారి వీధి, 24వ డివిజన్ ఆకుల వారి వీధిలో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నారు.

చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుదాం



పరిసరాలను శుభ్రం చేస్తున్న వలంటీర్లు

రాజమహేంద్రవరం సిటీ: చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఈసీ స్పెషలిస్ట్ అన్నమయ్య, డివైన్ మేనేజర్ ధనేకుల లావణ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలతో కంబాలచెరువు సమీపంలోని 5వ డివిజన్ శీలావారి వీధి, క్లస్టర్ 13 శానిటేషన్ విభాగంలో స్వచ్ఛంద సేవాసంస్థల వలంటీర్లతో కలసి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అన్నమయ్య మాట్లాడుతూ చెత్తను రోడ్డుపై వేయడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గార్బేజ్ ఫ్రీ క్లస్టర్‌గా తయారు చేసేందుకు ఖాళీస్థలాల్లో చెత్తను తొలగించే చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు. సుమారు 50 మంది కమ్యూనిటీ వలంటీర్లతో కలసి చెత్తను శుభ్రం చేసి, చుట్టుపక్కల నివాసముండే ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆ నివేదికపై జూన్ 12న విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్ఐ: గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామ ఎస్సీ కులస్తుల భూములను పోలవరం నిర్వాసితుల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం 2019లో సేకరించిందని ఆదివాసి మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై ఎస్సీ కులస్తులు లోకాయుక్తను ఆశ్రయించారని, లోకాయుక్త 2022లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టిందన్నారు. దీనిపై కలెక్టర్ మాధవీలతకు ఫిర్యాదు చేశామన్నారు. దాని ప్రకారం నివేదిక రూపొందించారన్నారు. వీరిపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్ 1991 ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్.. లోకాయుక్తకు నివేదిక పంపారని పేర్కొన్నారు. జూన్ 12న ఈ నివేదికపై కర్నూలులో లోకాయుక్త విచారణ జరుపుతుందన్నారు.

నివ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



నాగలక్ష్మి



రిత్విక్



జెట్టి రమ్య



మేరీ ప్రేమలత

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ఒకేషనల్ విభాగంలో దానవాయిపేటలోని నివ్య కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఆ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ మోజెస్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఒకేషనల్ ఎంఎల్‌టీ విభాగంలో కె.నాగలక్ష్మి 942, జూనియర్ ఒకేషనల్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో పి.రిత్విక్ 464, ఎల్ఎంటీలో జెట్టి రమ్య 462, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్‌లో జి.మేరీప్రేమలత 455 మార్కులు సాధించి ముందంజులో నిలిచారన్నారు. అలాగే పలువురు విద్యార్థులు 400లోపు మార్కులు సాధించారన్నారు.

ఐదున బీసీ సంఘ జాతీయ కార్యవర్గ సమావేశం



సమావేశంలోమాట్లాడుతున్న నరేష్ కుమార్ యాదవ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో మే ఐదున జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని, కార్యక్రమానికి ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరవుతారని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ చెప్పారు. స్థానిక తెలకుల సంక్షేమ సంఘం భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని శుభమస్తు కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆరు రాష్ట్రాల బీసీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. తొలుత వీఎల్ పురంలో ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యాలయాన్ని, నారాయణ లేడీస్ హాస్టల్‌ను ఆర్.కృష్ణయ్య ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మరుకుర్తి దుర్గా యాదవ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు.

ఎస్‌కేఆర్‌లో నేషనల్ వెబినార్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై నేషనల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఎవేర్నెస్ మిషన్ ఐక్యూఏసీ అండ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నేషనల్ వెబినార్ నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి వెబినార్ ముఖ్య అంశాలను తెలియజేశారు. ముఖ్య వక్తగా హాజరైన ఎస్ఐపీఏఎం అధికారి కె.వీరరాఘవులు మాట్లాడుతూ మేధా సంపత్తి హక్కుల విధానాలను వివరించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి సూరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సినిమాలు



రాజమహేంద్రవరం		
శ్యామల	:	ఏజెంట్
సూర్యమినీ	:	ఈవెల్‌డెడ్
రైజ్		
సూర్యప్యాలెస్	:	పి.ఎస్–2
స్వామి	:	ఏజెంట్
అశోక	:	విరూపాక్ష
శివజ్యోతి	:	ఏజెంట్
రాజా	:	ఏజెంట్
ఊర్వశి	:	రావణాసుర
రంభ	:	పి.ఎస్–2
మేనక	:	ఎస్ఐఎస్‌యు
నామవరం		
వీఎస్ మహల్	:	ఏజెంట్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	ఏజెంట్
కడియం		
వెంకటసూర్య	:	ఏజెంట్